క్లుప్తంగా

రూ.రెండు కోట్ల పంట బీమా విడుదల

సామర్లకోట: మండల పరిధిలో రెండు గ్రామాలోని రైతులకు రూ. రెండు కోట్ల పంట బీమా మంజూరైనట్లు ఎంఏఓ ఐ.సత్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాధవపట్నం, వీకే రాయపురం గ్రామాలకు చెందిన 983 మంది రైతులకు 2022వ సంవత్సరంలో పంట నష్టానికి పరిహారంగా ఈ బీమా వచ్చిందన్నారు. ఈ మొత్తం ఆయా రైతుల బ్యాంకు ఖాతాలలో జమ అవుతుందన్నారు.

సానుకూల దృక్పథం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయిరామకృష్ణ

సామర్లకోట: ప్రతి విద్యార్థి క్రమ శిక్షణ, సానుకూల దృక్పథం కలిగి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి స్థాయిలో స్థిరపడాలని జాతీయ ఉత్తమ పురస్కార గ్రహీత, స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ‘సీడ్’ అనే అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హెచ్ఎం యు.మీనామాధురి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాయిరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు భావోద్వేగాల నియంత్రణ, స్టడీ స్కిల్స్, ఆర్థిక అక్షరాస్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీఫ్ జిల్లా అధ్యక్షుడు కేసరి శ్రీనివాసరావు స్పందన ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు. ప్రస్తుత తరుణంలో బాలికా విద్యకు మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటరమణ, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంతీమాధవస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కుంతీమాధవస్వామి

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన కుంతీమాధవస్వామి వారికి శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున పండితుల స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అంలకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



కొత్తమూలపేటలో కిరణ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండలంలోని కొత్తమూలపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలను శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారిపడి గాయాల పాలైన మాతా కిరణ్, అనారోగ్యంతో బాధపడుతున్న మాతా చిన్నారావులను కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పరామర్శించారు. ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

తుని: ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్టు తుని డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ తెలిపారు. పలువురు ప్రయాణికులు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపారన్నారు. తుని నుంచి ఎస్.పైడిపాలకు బస్సు సర్వీసు నడపాలని గొల్లు వెంకటరమణ, కారేపల్లి రామకృష్ణ, తుని నుంచి ప్రత్తిపాడు, కిర్లంపూడి, సామర్లకోట మీదుగా కాకినాడకు బస్సు నడపాలని సుబ్రహ్మణ్యం, శ్రీనివాసా సెంటర్ నుంచి తుని రైల్వేగేటు వరకూ వెళుతున్న బస్సులు వేగంగా నడుపుతున్నారని వెంకటస్వామి, తుని నుంచి పిఠాపురం, సామర్లకోటకు రైలు లింక్ సర్వీసు ఏర్పాటు చేయాలని వీరబాబు, విద్యార్థులు, ఉద్యోగుల కోసం రాత్రి సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులు తుని డిపోలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లలిత్ కోరినట్టు ఆయన వివరించారు.

నగర పంచాయతీ కార్యాలయాన్ని మార్చండి

- అధికారులను కోరిన కౌన్సిలర్లు
- గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం



గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

పిఠాపురం: పట్టణ జనాభా రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయాన్ని వేరే చోటుకు మార్చాలని పలువురు కౌన్సిలర్లు అధికారులను కోరారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 16వ వార్డు కౌన్సిలర్ బావిశెట్టి జ్ఞానేశ్వరి, 3వ వార్డు కౌన్సిలర్ మైనం భవానీ రాజా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న నగర పంచాయతీ కార్యాలయం సరిపోయే పరిస్థితి లేనందున కార్యాలయాన్ని మరో చోటుకు మార్చి విశాలంగా నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌ను తరలించి ఆ ప్రదేశంలో నగర పంచాయతీ కారాలయం నిర్మించాలనే ప్రయత్నాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్టు టీడీపీ కౌన్సిలర్ గొల్ల సుబ్బారావు తెలిపారు. దీనిపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య కొంత సేపు వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. మార్కెట్‌పై ఆధారపడి 300 కుటుంబాలు బతుకుతున్నాయని, ఆ స్థలంలో కార్యాలయం నిర్మిస్తే వారి జీవనోపాధి పోతుందని సుబ్బారావు వాగ్వాదానికి దిగారు. దీనిపై కౌన్సిలర్ గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ 2011లో నగర పంచాయతీగా ఏర్పడ్డాకా రూ.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. దీంతో పాటు నగర పంచాయతీగా ఏర్పడిన ఏలేశ్వరం, ముమ్మిడివరంలో భవనాలు నిర్మించుకున్నారన్నారు. కాని ఇక్కడ నిర్మించలేకపోయారని, ఇప్పుడు నిర్మించడానికి చూస్తుంటే అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. ఇప్పుడు మార్కెట్ అని చెబుతున్న స్థలంలో గతంలో శ్మశానం ఉండేదని, దానిని కొందరు ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. ఆ స్థలంపై ఎవరికి ఏ హక్కు లేదని వారికి కావాలంటే వేరే స్థలం ఇవ్వొచ్చన్నారు. కో ఆప్షన్ సభ్యుడు మొగలి జయబాబు మాట్లాడుతూ ఆ స్థలంలో మార్కెట్ ఉండడం వల్ల పక్కనే ఉన్న మంచినీటి ట్యాంకులో నీరు కలుషితమవుతోందన్నారు. దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాగైనా మార్కెట్ ఉన్న ప్రదేశంలోనే నగర పంచాయతీ కార్యాయం నిర్మిస్తామని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తెగేసి చెప్పడంతో సమావేశంలో కొంత సేపు పరస్పర ఆరోపణలు వెల్లువెత్తాయి. నగర పంచాయతీ కార్యాలయం నిర్మించాల్సిన అవసరం ఉందని, కార్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరి సహకారం ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ గంద్రేటి మంగతాయారు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అనధికార కుళాయిలను క్రమబద్ధీకరించాలి

- అధికార పక్ష సభ్యుల డిమాండ్
- ఇంటి పన్ను అంశం వాయిదా
- సామర్లకోట కౌన్సిల్ సమావేశం



అధికారుల తీరుపై ప్రశ్నిస్తున్న సభ్యులు, సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: గత ప్రభుత్వంలోని అనధికార కుళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయాలని అధికార పక్ష సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇంటి పన్ను పేరు మార్పునకు సంబంధించి 20వ అంశాన్ని వాయిదా వేసి మిగిలిన అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. పేదలకు ఇచ్చిన ఇళ్లకు పన్నులు వేయకపోవడం వల్ల వారు చాలా ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారని కౌన్సిలర్ నేతల హరిబాబు సూచించారు. పట్టణంలోని అక్రమ కుళాయిలను క్రమబద్ధీకరించాలని వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ, రెడ్నం సునీత, చల్లపల్లి వెంకట సత్యనారాయణ అధికారులకు సూచించారు. దీంతో డీఈ హుస్సేన్ సూచనల మేరకు రూ.7,500 డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లిస్తే కుళాయి పన్ను క్రమబద్ధీకరిస్తామని కమిషనర్ జె.రామారావు తెలిపారు. అలాగే స్థానిక వాటర్ ట్యాంకులకు వెళ్లే రోడ్డులో నిర్మిస్తున్న కల్వర్టును నాలుగు అడుగులతో కాక ఆరు అడుగులకు పెంచాలని కరణం రాజ్‌కుమార్ సూచించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఈ అన్నారు. ఇస్మాయిల్ నగర్‌లో పార్కు ఆక్రమణపై పెండ్యాల నాగవెంకటలక్ష్మి ప్రశ్నించగా ఆక్రమణలు తొలగించి బోర్డు ఏర్పాటు చేసినట్టు టీపీఓ ఫణికుమార్ తెలిపారు. అంతకు ముందు కమిషనర్ రామారావు సభ్యులను పరిచయం చేసుకుని శనివారం నుంచి జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

సభ్యులకు దవులూరి కృతజ్ఞతలు

కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, అభిమానుల ప్రార్థనలతో బతికి బయటపడ్డానని ఇటీవల పాముకాటుకు గురైన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు అన్నారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రతి సభ్యుడిని ఆయన కలుసుకొని కృతజ్ఞతలు తెలిపి స్వీట్ ప్యాకెట్లు అందజేశారు.

అధికారుల తీరుపై గరంగరం

- అనధికార లే అవుట్లపై నిలదీసిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



పిఠాపురం కౌన్సిల్ సమావేశం

పిఠాపురం: పట్టణంలో ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేస్తుంటే అధికారులు పట్టించుకోకుండా ఏమి చేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు ఎజెండాలో పొందుపరచిన అంశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పిఠాపురం పట్టణ పరిధిలో అనేక అక్రమ లే అవుట్లు వెలిశాయన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా, మున్సిపాలిటీకి ఎటువంటి రుసుము చెల్లించకుండా లేఅవుట్లు వేసారని కౌన్సిలర్లు ఆరోపించారు. రానున్న రోజుల్లో లేఅవుట్లలో సైట్ల అమ్మకాలు పూర్తయితే లబ్ధిదారులు ఇళ్లు కట్టుకుంటారని, వాటికి రోడ్లు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు మున్సిపాలిటీ కల్పించాల్సి ఉంటుందన్నారు. ఏ నిధులతో వసతులు కల్పిస్తారని అధికారులను నిలదీశారు. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మించిన లేఅవుట్లను గుర్తించి వెంటనే అక్కడ నో పర్మిషన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సబంధిత నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. దీనిపై కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ వెంటనే అనధికార లేఅవుట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో మంచినీటి సమస్య తీవ్రమవుతుందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి



మరిడమ్మ ఆలయంలో జడ్జి, మెజిస్ట్రేట్‌లకు ఆశీర్వచనం అందిస్తున్న వేద పండితులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లిని జిల్లా జడ్జి హరినారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్ రామ్మోహనరావు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే పిఠాపురం మెజిస్ట్రేట్ ఎం.సుభాష్ మరిడమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ఏటా నిర్వహించే మరిడమ్మ జాతరలో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి వాసంతి

పిఠాపురం: ప్రజలు, న్యాయసేవా సంస్థకు వారధిగా పారా లీగల్ వలంటీర్లు పని చేయాలని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి సూచించారు. పిఠాపురం కోర్టు ఆవరణలో శుక్రవారం నూతనంగా ఎన్నికైన పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లు గ్రామ, పట్టణ పరిధిలోని పలు సమస్యలతో పాటు మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా కోర్టుకు విన్నవించే సమస్యలను పరిష్కరించాలన్నారు. వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. కోర్టు రూల్స్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, ఉపాధ్యక్షుడు భాస్కర్, బాదం ఈశ్వర్‌బాబు, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ వలంటీర్లకు అన్నింటా అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సరస్వతి

పెద్దాపురం: పారా లీగల్ వలంటీర్లు ప్రతి అంశంపైనా పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సరస్వతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం కోర్టు కాంప్లెక్స్‌లో పారా లీగల్ వలంటీర్ల శిక్షణను ఆమె ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సదస్సులో జడ్జి సరస్వతి మాట్లాడుతూ మహిళ, బాలిక, బాల కార్మిక తదితర చట్టాలపై వలంటీర్లు పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. న్యాయ సేవలపై న్యాయవాదులు కందుల వెంకటాచలం, ఎం.రాంబాబు, ఎస్.విశాలక్ష్మి, కెవిచలం, ఎస్,దుర్గారావు పలు సూచనలు, సలహాలిచ్చారు.

ఏకపక్షంగా వ్యవహరించొద్దు

- కమిషనర్ సురేంద్రపై కౌన్సిలర్ల ధ్వజం
- పలు అంశాలపై వాడీవేడిగా చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: ఏకపక్ష నిర్ణయాలతో కౌన్సిల్‌ను అప్రదిష్టపాలు చేస్తున్నారని సభ్యులు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రపై ధ్వజమెత్తారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు ఆరెళ్ళ వీర్రాఘవులు, విడదాసరి రాజా, పప్పల దుర్గారావు మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యుల ఫిర్యాదుపై స్థానిక దర్గాసెంటర్‌లో బస్‌స్టాప్ వద్ద ఓ నిరుపేద స్థలంపై టౌన్ ప్లానింగ్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడానికి కారణంగా కమిషనరేనని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఆక్రమణలపై తాము చేసిన ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గత టీడీపీ కౌన్సిల్ కాలంలో అక్రమ పాలన, దోపిడీపై స్పందనలో ఫిర్యాదు చేస్తామని, వాటిపైనా చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. మేజర్ డ్రైన్లలో సిల్టు తీయడం లేదని, అక్రమ కుళాయిలపై చర్యలు లేవని, మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమేరాల మరమ్మతులపై కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ వివరణ ఇస్తూ 213 కనెక్షన్లపై నోటీసులు జారీ చేశామన్నారు. అలాగే సీసీ కెమేరాలకు సత్వరం మరమ్మతులు చేయాలని చైర్ పర్సన్ ఆదేశించారు. అనంతరం పలు సమస్యలపై చర్చలు సాగాయి. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ముప్పన శ్యామలాంబ, టీపీఓ ఉమామహేశ్వరరావు, మేనేజర్ జ్యోతిరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, డీఈఈ ఆదినారాయణ, కౌన్సిలర్లు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కుస్తీ కోచ్ సతీమణికి సత్కారం



కుస్తీ కోచ్ సతీమణిని సత్కరించిన ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక వ్యాయమ కళాశాలలో అనేక మంది కబడ్డీ, కుస్తీ క్రీడాకారులను తయారు చేసిన కోచ్ గామా (సూర్యారావు) జ్ఞాపకార్థం ఆమె సతీమణి ఎస్.పాపాయమ్మను శుక్రవారం సాయంత్రం క్రీడాకారుల సంఘ ప్రతినిధులు సత్కరించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఫర్ ఒలింపిక్ మూమెంట్ చైర్మన్ ముత్తా నవీన్, సమన్వయకర్త కె.పద్మనాభం సత్కరించారు. సామర్లకోటలో క్రీడాకారులను తయారు చేయడానికి కృషి చేస్తున్నట్లు మోజెస్ తెలిపారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయండి

- ఆర్డీఓ రామారావు



జగనన్న సురక్ష కార్యక్రమంపై సూచనలిస్తున్న ఆర్డీఓ రామారావు



కొత్తపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి పుష్పామణి

పెద్దాపురం: ఈ నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీఓ జేఎస్ రామారావు సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గుడివాడ సచివాలయంలో ఆయన పర్యటించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు సలహాలిచ్చారు. ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతో సీఎం జగన్ అనేక పథకాలు అందజేస్తున్నారన్నారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ ప్రఖర్ జైన్ ఎంపీడీఓ అశోక్‌కుమార్, సర్పంచ్ కనేపర్తి చీమదొర, పంచాయతీ కార్యదర్శి ఎ.భారతి తదితరులున్నారు.

జి.మేడపాడులో..

సామర్లకోట: జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ డి. శ్రీలలిత అన్నారు. మండల పరిధిలో జి.మేడపాడు సచివాలయాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి వలంటీర్లు పర్యటించిన ఇళ్ల వివరాలు, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్ పటాని దేవి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్వే

పట్టణ పరిధిలో ప్రతి సచివాలయంలో మూడు బృందాల ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ఈ కార్యక్రమాలు శనివారం ఇస్మాయిల్ నగర్, 3న బ్రౌన్‌పేట–1, ఐదున రాజీవ్ గృహకల్ప, ఏడున బ్రౌన్‌పేట–2, 10న మణుగుల దిబ్బ, 12న అల్లంవారి వీధి, 14న బలుసులపేట, 15న బళ్ల మార్కెట్, 17న గోలివారి వీధి, 19న బళ్లమార్కెట్–2, 21న సత్యనారాయణపురం, 22న కొత్తూరు, 24న అయోధ్య రామపురం, 26న గాంధీనగర్, 28న అమ్మణమ్మ నాయుడు కాలనీలోని సచివాల యాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు కావలసిన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తారన్నారు.

కొత్తపల్లిలో సమీక్ష

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి పుష్పామణి కోరారు. స్థానిక గామ సచివాలయంలో జగనన్న సురక్షపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో కొత్తపల్లి నుంచే జగనన్న సురక్షను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే సర్వే పూర్తి చేశామన్నారు. ఈ సర్వేలో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను నమోదు చేశామని. వీటిని స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా..

తొలిరోజు శనివారం కొత్తపల్లి, 3న ఉప్పాడ సచివాలయం –1, 4న కుతుకుడుమిల్లి, 5న ఉప్పాడ–2, 6న వాకతిప్ప, 7న ఉప్పాడ–3, 8న గోర్స, 9న ఉప్పాడ–4, 11న కొమరగిరి–1, 12న అమీనాబాద్–1, 13న కొమరగిరి –2, 14న అమీనాబాదు–2, 15న ఇసుకపల్లి, 17న కొత్తమూలపేట, 18న కొండెవరం–1, 19న మూలపేట, 20న కొండెవరం–2, 21న పొన్నాడ–1, 22న నాగులాపల్లి–1, 24న పొన్నాడ–2, 25న నాగులాపల్లి–2, 26న శ్రీరాంపురం, 27న ఎండపల్లి–1, 28న రమణక్కపేట, 29న ఎండపల్లి–2 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.